క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



మాచర్ల: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించి ఎక్సైజ్ శాఖకు సహకరించాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో 24 గంటలూ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టడం జరుగుతోందన్నారు. అక్కడ నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించినా, మద్యం నిల్వ ఉంచినా, మద్యం కలిగి ఉన్న అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. తమ శాఖకు సహకరించి నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. సాగర్, రెంటచింతల చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.

చినగార్లపాడులో సురక్ష వైద్య శిబిరం



కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 315 మందికి వైద్య శిబిరంలో వైద్య సేవలందించారు. గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ఎం.లక్ష్మణరెడ్డి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.వెంకటేష్ రోగులను పరీక్షించి మందులు రాశారు. డాక్టర్లు రాసిన మందులను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.ప్రసాద్ నాయక్, సిబ్బంది 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి హైమావతి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కె.ప్రకాశరావు, ప్రభాకర్, శామ్యూలు, సుబ్బారెడ్డి, లక్ష్మీబాయి, విజయలక్ష్మి, శివసుధాకరరెడ్డి, రమేష్, సురేష్, జయపాల్, సాయి, ప్రవల్లిక, సుజాత, లక్ష్మయ్య, కరుణమ్మ, మనోజ్‌కుమార్, గోవిందమ్మ, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు వైద్య శిబిరంలో సేవలందించారు.

తపస్సుకాలం ఎంతో పవిత్రం

ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: లోకరక్షకుడైన యహోవా దేవుని కుమారుడైన యేసుక్రీస్తు శిలువ మరణం పొందిన అంతిమ ఘడియలలో పడిన శ్రమలను ఇప్పటికీ ప్రపంచ క్రైస్తవలోకం ఎంతో పవిత్రమైన ఈ తపస్సుకాలంలో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొంటారని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. శుక్రవారం కానుకమాత చర్చి ఆవరణలో నిర్వహించిన తపస్సుకాల ప్రత్యేక ప్రార్థనలలో ఫాదర్ వైఎల్ మర్రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభువైన యేసుక్రీస్తు ప్రపంచ మానవాళిని పాపముల నుంచి కాపాడేందుకు శిలువమరణం పొందారన్నారు. తపస్సుకాలంలో దీక్ష తీసుకునే భక్తులు భక్తిశ్రద్ధలతో నిష్ఠతో 40 రోజులుగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ గురువులు రె.ఫాదర్ అగస్టిన్, డీకన్ బ్రదర్ నిఖిల్ తేజ, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మొబైల్ కూలింగ్ వాటర్ వాహనం ప్రారంభం



మాచర్ల: పట్టణంలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో మొబైల్ కూలింగ్ వాటర్ వాహనాన్ని శుక్రవారం సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ప్రారంభించారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రధాన ప్రాంతంలో ఉచితంగా మొబైల్ వాహనం ద్వారా కూలింగ్ వాటర్ అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పోలిశెట్టి పుల్లారావు, చిన్నలాలు సాహెబ్, చింతలపూడి వెంకటేశ్వరరెడ్డి, మొహమ్మద్ సల్మా, ముత్యాల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40 మంది విద్యార్థులు గైర్హాజరు

మాచవరం: మండలంలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 40 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈవో బి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మ్యాథమెటిక్స్ పరీక్షకు జెడ్పీ హైస్కూల్‌లో 337 మంది విద్యార్థులకు ఐదుగురు, జీకే పబ్లిక్ స్కూల్‌లో 306 మంది విద్యార్థులకు 35 మంది హాజరు కాలేదని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను అధికారులు సందర్శించి, నిర్వహణను పరిశీలించినట్లు తెలిపారు.

ఒప్పిచర్లలో అభివృద్ధి పరుగులు

నాడు ఒకప్పుడు పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని మైక్రో ఫైనాన్స్ సంస్థలు పేదలను పీల్చిపిప్పి చేసిన దాఖలాలుండేవి. అధిక వడ్డీలకు తీసుకున్న ఆ అప్పులు చెల్లించలేని పరిస్థితి ఆనాడు ఉండేది. అలాగే ప్రజల సమస్యలు తీర్చేందుకు ఒక్క పంచాయతీ కార్యాలయమే దిక్కుగా ఉండేది. అవ్వాతాతలు పెన్షన్ తీసుకోవాలంటే రోజంతా పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉండేది.

నేడు సంక్షేమ పథకాలు పేదల ఆర్థిక అవసరాలు తీరుస్తుండడంతో గ్రామంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల జాడ లేకుండా పోయింది. అవ్వాతాతలకు పింఛన్లు ఇంటి వద్దే అందిస్తుండడంతో వారి ఇబ్బందులు తొలగాయి. విద్యాలయాలు బాగుపడ్డాయి. వైద్య సౌకర్యాలకు, రైతుల అవసరాలు తీర్చేందుకు, ప్రజల పౌర అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. వెరసి గ్రామం అభివృద్ధి బాటలో ఉంది.

- రూపురేఖలు మారిన ఒప్పిచర్ల
- వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల గ్రామం
- సంక్షేమం, అభివృద్ధితో సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాల

కారెంపూడి: పల్నాటి చరిత్ర కాలం నాటి పురాతన గ్రామాల్లో ఒప్పిచర్ల ఒకటి. పురాతన కాలం నాటి శివాలయం, ఆంజనేయస్వామి, దేవతల బావి, పోలేరమ్మ తల్లి ఇతర దేవతామూర్తులు గ్రామ ఆధ్యాత్మికతకు చిహ్నాలు. వ్యవసాయ ప్రధానమైన గ్రామం. రైతాంగం శ్రమటోడ్చి తమ పిల్లలను చదివించుకుంటూ అభివృద్ధి చెందుతున్న తీరు గర్వించదగింది. గ్రామంలో నేడు జనాభా 7,157 మందికి, ఓటర్లు 6,338 మంది ఉన్నారు.



రైతు భరోసా కేంద్రం



హెల్త్ క్లినిక్

చేకూర్చిన లబ్ధి..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	అందించిన మొత్తం
ఆసరా	695	రూ.1,29,09,832
అమ్మ ఒడి	379	రూ.1,36,71,000
పింఛను	619	రూ.4,58,94,000
రైతు భరోసా	547	రూ.1,87,65,000
జగనన్న విద్యా దీవెన	245	రూ.73,05,521
సున్నా వడ్డీ పంట రుణాలు	231	రూ.10,51,725
వైఎస్సార్ చేయూత	194	రూ.56,25,00

గ్రామాభివృద్ధి ఇలా..

సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు	రూ.1.65 కోట్లు
రెండు గ్రామ సచివాలయ భవనాలు	రూ.90 లక్షలు
రెండు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	రూ.48 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.24 లక్షలు
పాఠశాలల అభివృద్ధి	రూ.48 లక్షలు

ఇవే కాక ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే వివిధ గ్రాంటుల ద్వారా వ్యక్తిగతంగాను గ్రామంలో ప్రజల సమష్టి ప్రయోజనాల కోసం లక్షలాది రూపాయలు అందించారు. మొత్తం మీద గ్రామంలో సుమారు 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది.

గ్రామాభివృద్ధికి కృషి చేశా..



సర్పంచ్‌గా కొనసాగిన రెండేళ్లలో గ్రామాభివృద్ధికి కృషి చేశా. నా హయాంలో సుమారు రూ.1.30 కోట్లతో ప్రధాన రహదారి నిర్మాణంతో పాటు వివిధ పనులు చేయించా. వ్యక్తిగతంగా కూడా వివిధ అభివృద్ధి పనులకు రూ.5 లక్షల దాకా నా భర్త ఆంజనేయులు విరాళాలిచ్చారు.

– రామదేని లక్ష్మి, మాజీ సర్పంచ్, ఒప్పిచర్ల

సాయం మరువలేనిది..



ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా రూ.4 లక్షల లబ్ధి చేకూరింది. ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. వైఎస్సార్ ఆసరా అందుతోంది. వాహన మిత్ర పథకం ద్వారా లబ్ధి చేకూరుతోంది. అలాగే నా బిడ్డకు అమ్మఒడి వస్తోంది. నా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోడానికి జగనన్న అందించిన సాయం మరువలేనిది.

– బత్తుల అంజమ్మ, పొట్టిశ్రీరాములు కాలనీ, ఒప్పిచర్ల

అప్పుల బాధ తప్పింది..



ప్రతి నెల టంఛన్‌గా పింఛన్ వస్తోంది. వైఎస్సార్ చేయూత డబ్బులు ఏడాదికి రూ.18,750 అందాయి. అమ్మఒడి రావడం వల్ల ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. బయట అప్పు చేసే బాధ తప్పింది. చాలా మందిమి అవసరాలు తీర్చుకోవడం కోసం వారాల కిస్తీల కింద అధిక వడ్డీలకు అప్పులు చేసేవారు. ఆ బాధ తప్పింది.

– మంగా సాయమ్మ, ఒప్పిచర్ల

అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం



తాళ్ళపల్లి గ్రామానికి చెందిన టీడీపీ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల రూరల్: ఇచ్చిన మాట తప్పితే ఓటు అడగనని, మీ కుటుంబంలో సంక్షేమ లబ్ధి పొందితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వెయ్యమని ధైర్యంగా, నిజాయితీగా ప్రజలను ఓట్లు అడుగుతున్న ఏకైక నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లి గ్రామానికి చెందిన 25 కుటుంబాలకు చెందిన యాదవ, వడియరాజులు టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో 99శాతం హామీలను పూర్తి చేసి 20 ఏళ్లల్లో ఏ గ్రామంలో జరగని అభివృద్ధిని చేసి సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వంటివే కాకుండా కోట్లాది రూపాయలను సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి చేర్చిన సంక్షేమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని పీఆర్కే అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా, మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంగా భావించి 58 నెలల కాలంలో కోట్లాది రూపాయలను ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ద్వారా నేరుగా అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తాళ్ళపల్లి గ్రామానికి చెందిన తెల్లగొర్రల నాగయ్య, పాశం శ్రీనివాసరావు, పాశం నాగరాజు, కాటం పున్నారావు, పాండు, ముక్కా రామాంజి, ముక్కా అంజమ్మ, చిల్లా బ్రహ్మయ్య, ఉప్పుతోళ్ళ నాసరయ్య, కప్పయ్య తదితరులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బూడిద శ్రీనివాసరావు, సర్పంచ్ యంగ్రాలయ్య, మాజీ సర్పంచ్‌లు జూకూరి వెంకట్రామయ్య, పేర్ల అంకయ్య, చిల్లా నాగయ్య తదితరులున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం 6వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అజ్మీర శారద ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాసకాలనీకి చెందిన సుమారు 30 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, గురజాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మున్నూరి సురేష్, మున్నూరి గంగా, కొత్తపల్లి మహేష్, కొత్తపల్లి ఏసుదానం, వెంకటేష్, అరబోల గోపి, మున్నూరి రామకృష్ణ, మున్నూరి ఏసయ్య, మున్నూరి రామాంజీ, ఎం.రామకృష్ణ, పాదిలి బాలాజీ, మున్నూరి మార్క్, తుపాకుల ఏసురత్నం, మున్నూరి కిరణ్, రాజాలతోపాటు పలువురు ఉన్నారు. ఈ కర్యాక్రమంలో పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, సీనియర్ నాయకుడు భవనాశి యల్లారావు, కౌన్సిలర్లు అజ్మీర శారద, కుక్కమూడి సుందరం, గొట్టిముక్కల పవన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరామ క్షేత్రం భవనం ప్రారంభం

సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని కూరపాటి రాఘవులు, బాపమ్మ దాతృత్వంతో నిర్మించిన ప్రాంగణంలో ఆర్యవైశ్యులు అపరకర్మలు, ఆరామ క్షేత్రం, పితృయజ్ఞం పరిసర ప్రాంత ఆర్యవైశ్యులకు పది వసతి గదులు, వైకుంఠ సమారాధన ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం ఆరామ క్షేత్ర భవన గృహ ప్రవేశం చేశారు. పూజా కార్యక్రమాల్లో దాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శివపార్వతుల శాంతి కల్యాణం నిర్వహించారు. నిర్మాణానికి సహకరించిన గుండా పూర్ణ దంపతులను, ఇతర దాతలను సత్కరించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూధనరావు, ఉపాధ్యక్షుడు మాడా నాగరమేష్, అదనపు ఉపాధ్యక్షుడు నాగ వెంకట సుమన్‌బాబు, కార్యదర్శి తోమ్మండ్రు సత్యనారాయణ, కోశాధికారి సుబ్బారావు, ఉప కార్యదర్శి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని శివాలయం వద్ద ఉన్న 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి గుంటూరు బస్‌షెల్టర్ వరకు, మెయిన్ రోడ్డుకు తూర్పు వైపు, మాయబజార్ సెంటర్, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియా, వల్లెలా గార్డెన్ ప్రాంతంలో, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఘనంగా శాలివాహనుడి జయంతి వేడుకలు



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఆంధ్రుల ప్రప్రథమ చక్రవర్తి శాలివాహనుడి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాలివాహనుడు చిత్రపటానికి శాలివాహన సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నారాయణపురం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రులను ఏకతాటిపైకి తీసుకు వచ్చి మంచి పరిపాలన చేసిన గొప్ప చక్రవర్తిగా పేరు పొందిన శాలివాహనుడి జయంతి, వర్ధంతిని ఆంధ్రులు స్మరించుకోవడం మరువకూడదన్నారు. భారత ప్రభుత్వం 1957 మార్చి 22 నుంచి శక సంవత్సరాన్ని జాతీయ సంవత్సరంగా స్వీకరించిందన్నారు. శక సంవత్సరం క్రీస్తు శకానికి 78 సంవత్సరాలు వెనుకబడి ఉంటుందన్నారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. సంఘం నాయకులు నాగేశ్వరరావు, సిద్దయ్య, రాఘవేంద్రరావు, వెంకటేష్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు పవిత్ర మాసం 'రంజాన్'

అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్ మెస్త్రీ



పిడుగురాళ్ల: పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన మాసం రంజాన్ మాసం అని, ప్రతి ముస్లిం సోదరుడు రంజాన్ మాసంలో రోజా తప్పనిసరిగా ఉండాలని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మెస్త్రీ అన్నారు. పట్టణంలోని మర్కస్ (పెద్ద) మసీద్‌లో శుక్రవారం జోహర్ నమాజ్ అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ మాసం ప్రత్యేకత గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మెస్త్రీ మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్రమైన పండుగ రంజాన్. ఈ పండుగను నెలవంక చూసిన రోజు నుంచి మళ్లీ నెలవంక కనిపించేంత వరకు కఠోర దీక్షతో ఉపవాసం ఉండి ఐదు పూటల నమాజ్‌లు నిర్వహిస్తారన్నారు. రంజాన్ మాసంలో చేసే దానాలకు అధిక ప్రాముఖ్యత ఉంటుందన్నారు. దానాలు చేయడంతో పాపాల నుంచి విముక్తి పొంది అల్లా అనుగ్రహం పొందుతారని చెప్పారు. అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్ వలి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్, ఆప్టికల్ జానీ బాషా, మహబుబ్ జానీ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం

మాచర్ల ఆర్‌వో శ్యాంప్రసాద్



కారెంపూడి జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌ల వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌వో శ్యాంప్రసాద్

కారెంపూడి: ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరూ కూడా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎలక్షన్ కమిషన్ అన్ని చర్యలు తీసుకుంటోందని పల్నాడు జిల్లా జేసీ మాచర్ల ఆర్‌వో ఎ.శ్యాంప్రసాద్ వివరించారు. కారెంపూడి మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను శుక్రవారం ఆర్‌వో పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొన్ని ప్రామాణికాల ఆధారంగా మాచర్ల నియోజకవర్గంలో మొత్తం 141 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సెంట్రల్ ఫోర్స్ బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలతో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు ఉంటుందన్నారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. అందరూ కూడా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలును ఎప్పటికప్పుడు అధికారుల బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. కోడ్ ఉల్లంఘన జరుగుతుందనే సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో ఓటర్ల మార్పులు చేర్పులు తొలగింపులకు అవకాశం లేదని, 18 ఏళ్లు నిండినవారు ఓటు హక్కు పొందేందుకు మార్చి 31లోపు కానీ నామినేషన్ల సమర్పణ చివరి తేదీ లోపు ఫాం 6తో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రచారం చేసుకోదలచిన వారు యాప్‌లో దరఖాస్తు చేసుకోగానే వెంటనే అనుమతి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. తహసీల్దార్ జయవర్ధన్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు, ఇతర అధికారులు జేసీ వెంట పోలింగ్‌బూత్‌ల పరిశీలనలో పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 20 కుటుంబాల వారు చేరారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాచవరం మండలంలోని మల్లవోలు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనీయర్ నాయకుడు, జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి గంధం నాగేశ్వరరావు(నాగు) ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో యర్రంశెట్టి చిన్న వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి అమరలింగయ్య, కేశంశెట్టి శివరామ్మూర్తి, కేశంశెట్టి కోటేశ్వరరావు, గుండా రోశయ్య, రుద్రాల కొండలు, జలసూత్రపు శ్రీను, గంజి ఏడుకొండలు, గనకుంట గోపి, గంధం కిరణ్, గుండా ఆంజనేయలు, గంధం నాగేశ్వరరావు, ఆలూరి గోపి, తుమ్మలచెరువు వెంకటేశ్వర్లు, వాచికర్ల వెంకటేశ్వర్లుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ పిడుగురాళ్ల మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీల తరపున ప్రచారం చేస్తే కఠిన చర్యలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది రాజకీయ పార్టీల తరపున ప్రచారం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నోడల్ ఆఫీసర్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అధికారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి చిన్న విషయాన్ని కూడా సీరియస్‌గా తీసుకుంటుందన్నారు. ఎన్నికల కోడ్ (ఎన్నికల నియమావళి) అమలులో ఉన్న నేపథ్యంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయివేటు ఆస్తులపై, బహిరంగ ప్రదేశాలలో, ప్రార్థనా మందిరాలు, ఆలయాలు, చర్చిలు వద్ద ఎన్నికల ప్రచారానికి సంబంధించి గోడలపై రాతలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. ఎక్కడన్నా ఉన్నా వాటిని వెంటనే తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వెంకయ్య, సుబ్బారావు, బాలు నాయక్, నాగులు నాయక్, సోమేశ్వరరావు తదితరులున్నారు.

యరపతినేని మేనిఫెస్టో అంతా గ్యాసే

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మేనిఫెస్టోలో అంతా గ్యాసే అని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గత 30 సంవత్సరాలుగా మేనిఫెస్టోను ఏర్పాటు చేయని యరపతినేని శ్రీనివాసరావు ఇప్పుడు వైఎస్సార్‌సీపీని చూసి మేనిఫెస్టోను ఏర్పాటు చేశారు సంతోషకరం. కానీ ఈ సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో కేవలం ఐదు సంవత్సరాల్లో ఒక ఇంటికి ఒక గ్యాస్ సిలిండర్ మాత్రమే ఇస్తాననటంపై ఎద్దేవా చేశారు. ప్రజలు కోరుకుంటున్నది గ్యాస్ కాదని శాశ్వత పథకాలని చెప్పారు.

- తమ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గానికి మేనిఫెస్టోలో తాము మొట్ట మొదటిది జల దీక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి శుద్ధి చేసిన కృష్ణా నీరు అందించబోతున్నాం. రూ.73 కోట్లతో 57 గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరు చేయించాం, టెండర్లు పూర్తయి కొన్ని గ్రామాల్లో నీళ్లు ఇచ్చాం, కొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దాచేపల్లి, మాచవరం లిఫ్ట్ ఇరిగేషన్లతో పాటు కోనంకి గ్రామంలో కూడా నిర్మిస్తాం అన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేస్తే చిట్టచివరి భూములకు సాగునీరు అందుతుందన్నారు.
- రైతులకు దాచేపల్లి, నడికూడి మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటికే ఏర్పాటు చేశాం, దీన్ని గుంటూరు మార్కెట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. యరపతినేని విద్య పరంగా ఒక్కటైనా ప్రకటించారా అని ప్రశ్నించారు. కానీ తమ వైఎస్సార్‌సీపీ హయాంలో విద్యలోనే ఉన్నతమైన వైద్య విద్యకు కాలేజి నిర్మాణం ఇప్పటికే పూర్తి కావచ్చిందని వచ్చే సంవత్సరం అందుబాటులోకి వస్తుందన్నారు. పలు కాలేజీల నిర్మాణం చేపట్టి గురజాల నియోజకవర్గాన్ని విద్యకు హబ్‌గా ఏర్పాటు చేయబోతున్నాం అన్నారు.
- టీడీపీ హయాంలో ఒక్క హైవే నిర్మించలేకపోయారన్నారు. తాము పిడుగురాళ్ల బైపాస్ పూర్తి చేశాం, మాచవరం నుంచి రేగులగడ్డ వరకు రోడ్డు విస్తరణ కూడా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ఉండబోతుందని అన్నారు. +బీజేపీ నేత అమిత్‌షా ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ రద్దు చేస్తానన్నారు. కానీ దానిపై టీడీపీ నేత యరపతినేని నోరు విప్పరని విమర్శించారు. నియోజకవర్గంలోని 4 వేల మంది ముస్లింలకు ఇంటి పట్టాలు ఇచ్చాం. నియోజకవర్గంలోని పట్టణాల్లో, గ్రామాల్లో ఏపీ షాదీ ఖానాలు నిర్మించాం, అలాగే మరికొన్ని నిర్మించబోతున్నాం.
- దాచేపల్లిలో ఏపీఐఐసీ ద్వారా ఇండస్ట్రీ ఎస్టేట్ ఏర్పాటు చేస్తే పలు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయవచ్చన్నారు. యరపతినేని గురజాలను జిల్లా కేంద్రం చేస్తాననడం హాస్యాస్పదం అన్నారు. పాలనా సౌలభ్యం కల్పించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నారు. ఏది ఏమైనా చంద్రబాబు నాయుడు, యరపతినేని శ్రీనివాసరావులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మైనార్టీ పట్టణ కన్వీనర్ షేక్ బచ్చే మేస్త్రీ, కౌన్సిలర్లు కొక్కెర శ్రీను, అజ్మీర శారద, వైఎస్సార్ సీపీ నాయకులు కొతారు నరసింహారావు, ముడేల వెంకటేశ్వర్లు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, మోర్జంపాటి ఖాశీం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు వాల్మీకి మహర్షి విగ్రహ, దేవాలయ ప్రతిష్ఠ

మాచవరం: ఈనెల 24న మండలంలోని పిన్నెల్లి గ్రామంలో వాల్మీకి బోయ కాలనీలో వాల్మీకి మహర్షి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేద పండితులచే యజ్ఞశాల ఏర్పాటు చేసి ప్రత్యేక శాంతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కావున పరిసర గ్రామాల ప్రజలు కార్యక్రమానికి విచ్చేసి, జయప్రదం చేయాలని కోరారు.